వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

డిఎంహెచ్‌ఒ పిజె.అమృతం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వైద్య సిబ్బంది విధుల్లో అప్రమత్తంగా ఉండాలని డిఎంహెచ్‌ఒ పిజె.అమృతం ఆదేశించారు. సోమవారం సాయంత్రం జీలుగుమిల్లి పిహెచ్‌సిని ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గతంలో ఇక్కడ పని చేసిన ఓ వైద్యాధికారిని విధుల పట్ల అలసత్వంగా వ్యవహరిస్తున్నారని అప్పటి వైద్యాధికారులు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డిపార్ట్‌మెంట్‌కు అతనిని సరెండర్ చేయడంతో అతని సర్వీసును నిలుపుదల చేశారు. ఆ విషయమై అతను హైకోర్టును ఆశ్రయించారు. ఆ విషయమై సోమవారం పిహెచ్‌సికి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా అప్పట్లో పని చేసిన వైద్య సిబ్బందిని పిలిపించి విచారణ చేసినట్లు డిఎంహెచ్‌ఒ పిజె అమృతం తెలిపారు.

22ఎ భూములకు.. పరిష్కారం దొరికేనా..!

- నేడు ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో ప్రత్యేక గ్రీవెన్స్
- జిల్లావ్యాప్తంగా ఇప్పటికే 200 వరకూ ఫిర్యాదులు పెండింగ్
- ఎన్నోఏళ్లుగా ఇబ్బందులు పడుతున్న హక్కుదారులు
- అధికారులు చుట్టూ ఎన్నిసార్లు తిరిగినా పరిష్కారం కాని పరిస్థితి
- నోషనల్ ఖాతాల బాధితులు అత్యధికమే
- గ్రీవెన్స్‌పై ప్రజలకు సమాచారం అందజేతలో అధికారులు విఫలం

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

22ఎ భూముల సమస్యలకు ఇప్పటికైనా మోక్షం కలుగుతుందా అనే చర్చ జనాల్లో సాగుతోంది. ఇన్‌ఛార్జి మంత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉదయం తొమ్మిది గంటల నుంచి జరగనున్న 22ఎ భూముల ప్రత్యేక గ్రీవెన్స్‌పై అంతటా ఆసక్తి నెలకొంది. ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటు గురించి ప్రజలకు తెలియపర్చడంలో అధికారులు విఫలమయ్యారు. మీడియా, టాంటాంల ద్వారా తెలియపర్చాలని అనుకున్నా సరైన రీతిలో ప్రచారం మాత్రం జరగలేదు. దీంతో చాలామందికి 22ఎ భూములపై ప్రత్యేక గ్రీవెన్స్ నిర్వహణపై సమాచారం లేకుండా పోయింది. నవంబర్ 26న జరిగిన డిఆర్‌సి సమావేశంలో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాదెండ్ల మనోహర్ చేసిన ప్రకటన తర్వాత అధికారులు ప్రజలకు చేరవేయడంలో ప్రత్యేక చర్యలేమీ తీసుకోని పరిస్థితి కన్పించింది. దీంతో మంగళవారం గ్రీవెన్స్‌కు ఫిర్యాదుదారులు ఎంతమంది వస్తారనే దానిపై సందిగ్ధత నెలకొంది. ఏలూరు జిల్లాలో పెద్దఎత్తున ప్రయివేటు వ్యక్తుల భూములు 22ఎలో ఉన్నట్లు ప్రజాప్రతినిధులు చెబుతున్నారు. అధికారులు మాత్రం తమ వద్ద దాదాపు 200 ఫిర్యాదులు మాత్రమే ఉన్నట్లు చెబుతున్నారు. అధికారుల లెక్కలకు.. క్షేత్రస్థాయి పరిస్థితికి ఏమాత్రం సంబంధం లేదని గడిచిన డిఆర్‌సి సమావేశంలో మంత్రి కొలుసు పార్థసారధి చెప్పారు. ప్రభుత్వం సైతం 22ఎ భూముల పరిష్కారంపై గట్టిగా ఉండటంతో ఎట్టకేలకు ప్రత్యేక గ్రీవెన్స్ ఏర్పాటుకు శ్రీకారం చుట్టిన పరిస్థితి ఉంది. 22ఎ సెక్షన్‌లో ఐదు రకాల భూములు ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వ భూములు, కేంద్ర ప్రభుత్వ భూములు, దేవాదాయ, వక్ఫ్ వంటి భూములు, ప్రభుత్వం ప్రజలకిచ్చిన భూములు, చుక్కల భూములు ఈ సెక్షన్‌లో ఉంటాయి. వీటిలో ప్రయివేటు వ్యక్తుల అనుభవంలో ఉండి 22ఎలో ఉన్న భూములను మాత్రం పరిష్కరించడానికి వీలుంటుంది. ఎన్నోఏళ్లుగా తమ అనుభవంలో భూములు ఉన్నప్పటికీ 22ఎలో ఉంటే క్రయ విక్రయాలకు ఏమాత్రం అవకాశం లేకుండాపోతుంది. రిజిస్ట్రేషన్ ప్రక్రియ జరగదు. దీంతో భూమి ఉన్నప్పటికీ ప్రయోజనం లేని పరిస్థితి ఏర్పడింది. 22ఎ భూములకు సంబంధించి రెవెన్యూ అధికారులకు ఫిర్యాదులు అందుతున్నా పట్టించుకోని పరిస్థితి. దీంతో ఏళ్ల తరబడి సంబంధిత భూ యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. 22ఎ భూములు అత్యధికంగా కృష్ణా జిల్లా నుంచి కలిసిన నూజివీడు నియోజకవర్గ పరిధిలో ఉన్నట్లు తెలుస్తోంది. 22ఎ భూములకు సంబంధించి ఫిర్యాదులు ఇచ్చిన తర్వాత పరిష్కారం చూపిస్తారా.. గతంలో మాదిరిగా ఫిర్యాదులు తీసుకుని పక్కన పెట్టేస్తారా అనే అనుమానాలు అందరినీ వెంటాడుతున్నాయి. ఎన్నోఏళ్లుగా తమ అనుభవంలో ఉండి 22ఎలో ఉన్న భూములను ప్రత్యేక గ్రీవెన్స్ ద్వారా పరిష్కారం దొరికితే రైతులకు ఎంతగానో మేలు జరుగుతుంది. గ్రామాల్లో టాంటాం ద్వారా ప్రచారం చేసి ఉంటే బాగుండేదన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

అదే తరహాలో నోషనల్ ఖాతాల భూములు

22ఎ భూములతోపాటు నోషనల్ ఖాతాలకు సంబంధించిన భూములు జిల్లాలో పెద్దఎత్తున ఉన్నాయి. పిజిఆర్‌ఎస్‌లో ఫిర్యాదులు చేస్తున్నా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదు. లక్ష సంఖ్యలో నోషనల్ ఖాతా ఉంటే తహశీల్దార్ పరిష్కరించే అవకాశం ఉంటుంది. రెండు లక్షల నెంబరితే నోషనల్ ఖాతా ఉంటే మాత్రం జాయింట్ కలెక్టర్ లాగిన్‌లో మాత్రమే అవుతోంది. దీంతో చాలామంది తమ భూములు నోషనల్ ఖాతాల్లో ఉండటంతో పరిష్కారం కోసం ఎన్నోఏళ్లుగా జనం రెవెన్యూ అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. అయినప్పటికీ పరిష్కారం మాత్రం కావడం లేదు. రెవెన్యూ సమస్యల పరిష్కారంలో అధికారులకు చిత్తశుద్ధి లేకపోవడమే ఇందుకు ప్రధాన కారణమనే విమర్శలు సైతం ఉన్నాయి. ప్రత్యేక గ్రీవెన్స్‌లో నోషనల్ ఖాతా భూసమస్యలను సైతం పరిష్కరిస్తారో.. లేదో వేచిచూడాలి.

సిఐటియు అఖిల భారత మహాసభ జయప్రదం కోరుతూ

వాడవాడలా సిఐటియు పతాకావిష్కరణలు

ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

నగరంలో సోమవారం సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. అఖిలభారత మహాసభ సందర్భంగా దేశవ్యాప్త పిలుపులో భాగంగా ఏలూరు పాత బస్టాండ్ ఆటోస్టాండ్ వద్ద జెండాను సిఐటియు నగర కార్యదర్శి ఎం.ఇస్సాక్ ఎగరవేశారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి డిఎన్‌విడి.ప్రసాద్ మాట్లాడుతూ జనవరి 4న విశాఖపట్నంలో జరుగుతున్న భారీ బహిరంగ సభలో జిల్లావ్యాప్తంగా ఉన్న కార్మికవర్గం పెద్దసంఖ్యలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్స్ రద్దు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం 2019 రవాణారంగ చట్ట సవరణ ఫలితంగా జరిమానాలు పెరిగిపోయాయని, ఆటో కార్మికుని సగటు ఆదాయం కంటే జరిమానాలు విధించే మొత్తం అనేక రెట్లు ఉండడం వల్ల ఆటో కార్మికులు అప్పుల పాలవుతున్నారని అన్నారు. ఫిట్‌నెస్ ఛార్జీ రెట్టింపు కావడమే కాకుండా పది సంవత్సరాలు దాటిన వాహనాలకు రూ.ఏడు వేల నుండి రూ.33 వేల వరకు వసూలు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏలూరు జిల్లాలో వాహనాలకు ఫిట్‌నెస్ రెన్యువల్ చేయకుండా నిలిపివేసి దూర ప్రాంతాల్లో ఉన్నటువంటి ఎటిఎస్ సెంటర్లకు వెళ్లాలని చెబుతున్న ప్రభుత్వ నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. సిఐటియు జిల్లా కార్యాలయం వద్ద జిల్లా అధ్యక్షులు ఆర్.లింగరాజు జెండా ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లేబర్ కోడ్స్ వెంటనే రద్దు చేయాలని, లేనిపక్షంలో దేశవ్యాప్తంగా సమ్మె నిర్వహిస్తామని హెచ్చరించారు. ఎల్ఐసి కార్యాలయం వద్ద జరిగిన జెండావిష్కరణలో యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.రవికిషోర్ పాల్గొని ప్రసంగించారు. ఈ కార్యక్రమాల్లో ఆటో యూనియన్ నాయకులు పంపన రవికుమార్, అడ్డాల రాజు, బెల్లంకొండ త్రినాథ్, చక్రాల అమర్ కుమార్, జె గోపి, బొడ్డేపల్లి చంద్రశేఖర్, శేఖర్, టికె.రావు, కోలా రాజా, శంకర్, పి.నారాయణ, రమణ, మోహన్‌రావు పాల్గొన్నారు.

నూజివీడు టౌన్: పట్టణంలో పలుచోట్ల సిఐటియు జెండాలు ఆవిష్కరించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, నేతలు ప్రభాకర్, సంసోను, రంగారావు, ప్రసాద్, వెంకటేశ్వరరావు, అప్పారావు, కామేష్, మణికంఠ తదితరులు పాల్గొన్నారు.

జంగారెడ్డిగూడెంలో...

జంగారెడ్డిగూడెం: సిఐటియు అఖిల భారత మహాసభను జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం స్థానికంగా పలుచోట్ల సిఐటియు పతాకాలు ఆవిష్కరించారు. సిఐటియు కార్యాలయం వద్ద కెఎస్.నారాయణ, మున్సిపల్ కార్యాలయం వద్ద బి.బాలరాజు, ఆర్‌టిసి డిపో వద్ద ఆర్‌టిసి నాయకులు ఎం.విజయశ్రీ, తహశీల్దార్ కార్యాలయం వద్ద కార్యాలయం ఆరేటి రామచంద్రరావు జెండావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ పి.సూర్యారావు మాట్లాడగా, ఆయా సంఘాల నేతలు డి.ఆశీర్వాదం, కె.రామారావు, వి.గోపి తదితరులు పాల్గొన్నారు.



నూజివీడులో...

ఆగిరిపల్లి: సిఐటియు అఖిల భారత మహాసభ సందర్భంగా సిఐటియు జెండాలను పలు చోట్ల ఆవిష్కరించారు. ఆగిరిపల్లిలోని మెయిన్ సెంటర్, నెక్కలం గొల్లగూడెంలోని కుశలవ ఇంటర్నేషనల్ లిమిటెడ్ కంపెనీలో కుశలవ ఇంటర్నేషనల్ లిమిటెడ్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో సిఐటియు జెండాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.రాజు, నేతలు ఎం.నరేష్, ఎస్.కోటేశ్వరరావు, కిరణ్, కెవికె.ప్రసాద్, ఆర్.చంటి, కె.రామకృష్ణ, అయ్యప్ప, సిహెచ్.శ్రీను, కుశలవ వర్కర్స్ యూనియన్ కార్మికులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లిలో...

వేలేరుపాడు రూరల్: సిఐటియు అఖిలభారత మహాసభను జయప్రదం చేయాలని జిల్లా నాయకులు మడివి దుర్గారావు పిలుపునిచ్చారు. స్థానిక అంబేద్కర్ సెంటర్‌లో ఫ్రెండ్స్ ఆటో యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ఆటో యూనియన్ ప్రెసిడెంట్ కురిమెళ్ల శ్రీను, నాయకులు సోమవారం సిఐటియు పతాకావిష్కరణ చేశారు. కార్యక్రమంలో సిఐటియు మండల కోకన్వీనర్ బి.వెంకటేశ్వర్లు, ఆటో యూనియన్ నేతలు కె.లక్ష్మయ్య, ఎస్‌కె.పాషా, సతీష్, జాకీర్, రమేష్, లీలా పాల్గొన్నారు.

వేలేరుపాడులో...

కుక్కునూరు రూరల్: సిఐటియు జాతీయ మహాసభను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కార్యదర్శి యర్నం సాయికిరణ్ కోరారు. సోమవారం మం డలంలోని పలు గ్రామాల్లో శ్రమ జీవుల స్వేచ్ఛా పతాకం సిఐటియు జెండాను ఆవిష్కరించారు. స్థానిక సుందరయ్య భవనం వద్ద సిఐటియు జెండాను సాయికిరణ్ ఆవి ష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు యర్రంశెట్టి నాగేంద్రరావు, గిరిజన సంఘం మండల కార్యదర్శి పట్ల లక్ష్మయ్య, సిఐటియు మండల కోకన్వీనర్ కుంజ నాగలక్ష్మి, బాడిస సుజాత, నాయకులు కాక బాపనమ్మ, అన్నపూర్ణ, మంగ, భూక్య చందు, సుస్మిత, కారం నాగలక్ష్మి పాల్గొన్నారు.

కుక్కునూరులో...

కొయ్యలగూడెం: రైస్ మిల్ అండ్ బజార్ జట్టు వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక రైస్‌మిల్లు సెంటర్‌లో సిఐటియు జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు శుక్లబోయిన రాంబాబు మాట్లాడారు. యూనియన్ అధ్యక్షుడు బి.రమేష్, కార్యదర్శి సిహెచ్. సుబ్రహ్మణ్యం, నేతలు శివకుమార్, కె.సీతారాముడు, కె.నాగరాజు, వంకా దుర్గారావు, బి.వీర్రాజు, ఆకుల నాగరాజు, టి.నాగు, నాని, కె.దుర్గారావు పాల్గొన్నారు.

కొయ్యలగూడెంలో...

ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్ట పరచాలి

అసైన్డ్ భూముల రక్షణకు అమ్మకాలు, కొనుగోలు నిషేధాన్ని కొనసాగించాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి ఎ.రవి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టాన్ని మరింత పటిష్ట పరచాలని, చట్టాన్ని చట్టంగానే కొనసాగించాలని, పథకంగా మార్పు చేయరాదని, రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూముల రక్షణకు అమ్మకాలు, కొనుగోలు నిషేధాన్ని కొనసాగించాలని సిపిఎం జిల్లా కమిటీ తరపున ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఎ.రవి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికులకు తీవ్రమైన అన్యాయం జరిగేలా నిర్ణయాలు చేస్తుందని తెలిపారు. ముఖ్యంగా ఉపాధి హామీ చట్టాన్ని ఇప్పుడు పూజ్య బాపు గ్రామీణ రోజ్ గారి యోజన పథకంగా పేరు మార్చి పేదలు, వ్యవసాయ కార్మికుల పొట్ట కొట్టేందుకు ప్రయత్నిస్తుందని పేర్కొన్నారు. కేవలం పేరు మాత్రమే మారుస్తున్నారని అనుకుంటే పొరపాటేనని, చట్టంగా ఉన్న దానిని పథకంగా మార్పు చేయడం వల్ల భవిష్యత్తులో ఈ చట్టం నీరు గారే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. చట్టాన్ని పథకంగా మార్చడం వల్ల ప్రభుత్వాల దయాదాక్షిన్యాలపై ఆధారపడి ఉండాల్సి వస్తుందని తెలిపారు. సంవత్సరానికి వంద రోజులు పనులు చూపించాల్సి ఉండగా జిల్లాలో కేవలం 38 రోజుల నుంచి 50 రోజుల మధ్య మాత్రమే పనులు చూపించారని తెలిపారు. గ్రామీణ పేదలు, వ్యవసాయ కార్మికుల జీవనోపాధి కాపాడేందుకు పెట్టిన ఈ చట్టాన్ని మరింత పటిష్టపరిచి వంద రోజుల నుంచి 200 రోజులకు పనులు పెంచాలని, రోజుకు రూ.600 వేతనం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే లేబర్ కోడ్స్‌ను మార్చి కార్మిక చట్టాన్ని రద్దు చేసిందని, ఫలితంగా ఎనిమిది గంటల పని విధానం స్థానంలో ఇప్పుడు పది నుంచి 12 గంటలు పని చేయాల్సి వస్తుందని తెలిపారు. ప్రజలను మభ్యపెట్టే విధంగా కేంద్ర ప్రభుత్వం పేరు మార్చి 125 రోజులు పనులు పెంచుతున్నట్లు ప్రకటన చేసిందని తెలిపారు.

రాష్ట్ర ప్రభుత్వం అసైన్డ్ భూములు సంపన్నులకు కట్టబెట్టే పద్ధతుల్లో వాటి మీద అమ్మకాలు, కొనుగోలు చర్యలు జరిగేలా వీలు కల్పిస్తూ గతంలో ఉన్న నిషేధాన్ని ఎత్తివేసిందని, దీనిని సిపిఎంగా పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని తెలిపారు. ఈ నిషేధాన్ని ఎత్తివేయడం ద్వారా పేదలు, దళితులు, గిరిజనులకు చెందాల్సిన అసైన్డ్ భూములు సంపన్నుల చేతుల్లోకి పోతుందని పేర్కొన్నారు. అనేక పోరాటాల ఫలితంగా 9/77 చట్టం ప్రకారంగా అసైన్డ్ భూములు పేదలకు, దళితులకు, గిరిజనులకు పంపిణీ చేశారని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటికీ దాదాపు 50 శాతం భూములు అన్యాక్రాంతమై సంపన్నుల చేతుల్లోనే ఉన్నాయని తెలిపారు. కొన్నిచోట్ల పేదలను, దళితులను, గిరిజనులను భయపెట్టి, మభ్యపెట్టి తిరిగి సంపన్నులు స్వాధీనం చేసుకున్నారని తెలిపారు. ఇప్పుడు ఆ భూములను ఆక్రమించుకున్న సంపన్నులకు కట్టబెట్టేవిధంగా ఫ్రీ హోల్డ్‌పై నిషేధం అనే దానిని ఎత్తివేసి అమ్మకాలకు, కొనుగోలుకు యథేచ్ఛగా అవకాశాన్ని కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం పేదవాని చేతిలో సెంటు భూమి కూడా లేకుండా చేయాలని దుర్మార్గమైన కుట్రకు పూనుకుందని పేర్కొన్నారు. ఈ పద్ధతిని తాము పూర్తిగా వ్యతిరేకిస్తున్నామని, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని, లేకపోతే పేదలు, దళితులు, గిరిజనులను సమీకరించి వారికి న్యాయబద్ధంగా చెందాల్సిన అసైన్డ్ భూముల విషయంలో పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు.

అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలి

వృద్ధులు, వికలాంగుల అర్జీలకు ప్రాధాన్యతివ్వాలి

కలెక్టర్ కె.వెట్రిసెల్వి

పిజిఆర్‌ఎస్‌కు 294 అర్జీలు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ కె.వెట్రిసెల్వి

ప్రజాశక్తి - ఏలూరు

పిజిఆర్‌ఎస్ అర్జీలకు నాణ్యమైన పరిష్కారం చూపాలని కలెక్టర్ వెట్రిసెల్వి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గోదావరి సమావేశ మందిరంలో సోమవారం జిల్లాస్థాయి ప్రజాసమస్యలు పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆమె జిల్లా అధికారులతో కలిసి నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎంజె.అభిషేక్ గౌడ, డిఆర్‌ఒ వి.విశ్వేశ్వరరావు, ఆర్‌డిఒ ఎం.అచ్యుతఅంబరీష్, డిప్యూటీ కలెక్టర్ ఎల్.దేవకిదేవి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వెట్రిసెల్వి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారంపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. మండలాల్లో ప్రజల నుండి వచ్చిన అర్జీలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలన్నారు. ప్రజల నుంచి స్వీకరించిన అర్జీలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించి నిర్ణీత గడువులోపు నాణ్యమైన పరిష్కారం చూపాలన్నారు. వృద్ధులు, వికలాంగులు అర్జీల పరిష్కారంలో మొదటి ప్రాధాన్యతను ఇవ్వాలని, వారి చెంతకే వెళ్లి అర్జీలను స్వీకరించి, సమస్యలను స్వయంగా అడిగి తెలుసుకున్నారు. తమశాఖ పరిధిలో లేనివి అర్జీలు వస్తే వాటిని తక్షణమే సంబంధిత శాఖల అధికారులకు పంపించాలని, అలసత్వం, నిర్లక్ష్యం వహిస్తే పరిస్థితి జఠిలమవుతుందన్నారు. అధికారులు, లబ్ధిదారులతో స్వయంగా మాట్లాడి సమస్యలను పరిష్కరించాలని, అర్జీలు పునరావృతం కాకుండా నాణ్యతతో శాశ్వత పరిష్కారం చూపాలన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ పరిపాలనాధికారి ఎన్‌వి.నాంచారయ్య, సూపరింటెండెంట్లు తదితరులు పాల్గొన్నారు.

పోలవరం జిల్లాలో 'పోలవరం'ను కలపాలి

జెఎసి ఆధ్వర్యాన నిరసన



వినతిపత్రం అందిస్తున్న జెఎసి నాయకులు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

రంపచోడవరం కేంద్రంగా పోలవరం పేరుతో ఏర్పడే జిల్లాలో పోలవరం నియోజకవర్గాన్ని కలపాలని జిల్లా జెఎసి నాయకులు రావుల సర్వేశ్వరరావు డిమాండ్ చేశారు. మండలంలోని కామయ్యపాలెం సచివాలయ పరిధిలో జెఎసి ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్వేశ్వరరావు మాట్లాడుతూ రంపచోడవరం కేంద్రంగా పోలవరం జిల్లాలో పోలవరం నియోజకవర్గం, పోలవరం నియోజకవర్గం లోని టి.నర్సాపురం, కొయ్యలగూడెం, జంగారెడ్డి గూడెం, గోపాలపురం మండలాల్లోని షెడ్యూల్ గ్రామాలను కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని కోరారు. అనంతరం సచివాలయ సిబ్బందికి వినతి పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రైతు సం ఘం నాయకులు ఎం.పెద్దబాబు, జెఎసి నాయకులు వెంకటేశ్వరరావు, రాజు, జగదీష్, జ్ఞానసుందరం, పాల్గొన్నారు.

బుట్టాయగూడెం :పోలవరం నియోజకవర్గంలో ఉన్న మండలాలు, నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న ఆదివాసీ గిరిజన గ్రామాలను షెడ్యూల్ ప్రాంతంలో కలుపుతూ పోలవరం జిల్లా ఏర్పాటు చేయాలని సిపిఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ ప్రజా ప్రతినిధులు, వైసిపి ప్రజా ప్రతినిధులు కోరారు. ఈ మేరకు సోమవారం పిజిఆర్‌ఎస్‌లో కలెక్టర్ వెట్రిసెల్వికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వైస్ ఎంపిపి గోగులోతు మోహన్‌రావు, అలివేరు సర్పంచి కారం లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం జిల్లాల పునర్విభజనలో భాగంగా రంపచోడవరం డివిజన్ ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయడం దానికి పోలవరం పేరు పెట్టడం సరికాదన్నారు. పోలవరం నియోజకవర్గం మండలాలను, నాన్ షెడ్యూల్ ప్రాంతంలో ఉన్న గిరిజన గ్రామాలను కలుపుతూ ప్రత్యేక జిల్లా ఏర్పాటు చేయాలని, జిల్లా కేంద్రంగా కోట రామచంద్రపురం ఐటిడిఎను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటికైనా పునరాలోచన చేసి పోలవరం నియోజకవర్గాన్ని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేసి ఆదివాసీ గిరిజన ప్రజల ఆకాంక్షను నెరవేర్చాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో కోర్స గంగరాజు, కెచ్చెల ముక్కరెడ్డి, తెల్లం సింహాచలం, ఎంపిటిసి సభ్యులు పోసిబాబు, తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ఆటో, బైక్ ఢీకొని భార్యాభర్తలు, అంబులెన్స్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - కొయ్యలగూడెం

ఆటో బైక్‌ను ఢీకొన్న ప్రమాదంలో భార్యాభర్తలు మృతి చెందారు. ఈ ఘటన కొయ్యలగూడెం గ్రామ శివారులోని కొత్తూరు క్రాస్ రోడ్డు వద్ద సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తూర్పు గోదావరి జిల్లా కోరుకొండ మండలం గాడాల గ్రామానికి చెందిన ప్రత్తి జయరాజు (50) ఆయన భార్య సత్య (42)లు సోమవారం బైక్‌పై జంగారెడ్డిగూడెంలోని తమ కుమార్తె ఇంటికి బయలుదేరారు. వీరు కొయ్యలగూడెం శివారులోని కొత్తూరు క్రాస్ రోడ్డు వద్దకు వచ్చేసరికి జంగారెడ్డిగూడెం నుంచి కొయ్యలగూడెం వైపు వస్తున్న ట్రక్ ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో బైక్‌పై ఉన్న భార్యాభర్తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ వి.చంద్రశేఖర్ తెలిపారు.

అంబులెన్స్, బైక్ ఢీకొని వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం : అంబులెన్స్ ఢీకొని వ్యక్తి మృతి చెందిన ఘటన జంగారెడ్డిగూడెం మండలం వేగవరం గ్రామ శివారులో దేవరపల్లి-తల్లాడ జాతీయ రహదారిపై సోమవారం చోటు చేసుకుంది. పోలీసులు, మృతుని బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలో అద్దె ఇంట్లో నివాసం ఉంటున్న చింతలపాటి శంకర్ (40) అద్దె ఇంట్లో ఉంటూ కూలి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయం వ్యక్తిగత పనుల నిమిత్తం బైక్‌పై తాడువాయి వెళ్లాడు. అక్కడ పని చూసుకుని తిరిగి జంగారెడ్డిగూడెం బయలుదేరాడు. ఈ క్రమంలో వేగవరం గ్రామ శివారులోకి వచ్చేసరికి విజయవాడ నుంచి వేలేరుపాడుకు మృతదేహాన్ని తీసుకొస్తున్న ప్రభుత్వ అంబులెన్స్, బైక్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తీవ్ర గాయాలపాలైన శంకర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించి ట్రాఫిక్ క్లియర్ చేశారు. శంకర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు జంగారెడ్డిగూడెం పోలీసులు తెలిపారు. మృతునికి భార్య కరుణకుమారి, ఇద్దరు కుమార్తెలు లక్ష్మి, మౌనిక ఉన్నారు. పెద్ద కుమార్తె లక్ష్మి పదో తరగతి, చిన్న కుమార్తె మౌనిక ఎనిమిదో తరగతి చదువుకుంటున్నారు. కుటుంబ పెద్ద అకాల మరణంతో కుటుంబ సభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు. తమ జీవనాధారం కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

టెట్‌కు వంద శాతం హాజరు

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఉపాధ్యాయ అర్హత పరీక్ష-2025 సోమవారం ఏలూరులో ప్రశాంతంగా జరిగింది. వట్లూరు సిద్ధార్థ క్వెస్ట్ పాఠశాలలో మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు జరిగిన పరీక్షకు మొత్తం 66 మందికి 66 మంది హాజరయ్యారు. ఈ పరీక్షలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగలేదని, పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.వెంకటలక్ష్మమ్మ తెలిపారు.

చట్ట వ్యతిరేక భూ సేకరణ నిలిపివేయాలి

తహశీల్దార్ కార్యాలయం వద్ద ఆదివాసీ గిరిజన సేన సంఘం ఆధ్వర్యాన నిరసన



మాట్లాడుతున్న నాయకులు

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

చట్ట వ్యతిరేక భూ సేకరణ నిలిపివేయాలని కోరుతూ ఆదివాసీ గిరిజన సేన సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద సోమవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో గిరిజనుల సాగులో, కోర్టు ఆర్డర్ ఉన్న భూములను పోలవరం ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీలో గిరిజన చట్టాన్ని తుంగలో తొక్కి అక్రమ పద్ధతిలో భూములు కొనుగోలు చేస్తున్నారన్నారు. చట్టాలకు వ్యతిరేకంగా ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ అమలు చేస్తుందన్నారు. గ్రామసభలో తీర్మానం లేని చట్ట వ్యతిరేకంగా కొనుగోలు చేసిన భూములు నిలుపుదల చేసి రికార్డు వెరిఫికేషన్ చేసి గిరిజన చట్టాలను అమలు చేయాలని కోరారు. ప్రభుత్వ అధికారులు, అధికార పార్టీ అండదండలతో గిరిజన చట్టాలను అక్రమ పద్ధతిలో అమలు చేస్తున్నారన్నారు. గిరిజన భూ సమస్యను పట్టించుకోకుండా తప్పుడు పద్ధతిలో భూములు కొనుగోలు చేస్తున్నారని ఆదివాసీ సేన ఆధ్వర్యంలో హైకోర్టును ఆశ్రయించగా చట్ట వ్యతిరేకంగా భూములు కొనుగోలు చెల్లదని, గిరిజన పీసా కమిటీ గిరిజన చట్టాలు సక్రమంగా అమలు చేసి న్యాయబద్ధమైన భూములను కొనుగోలు చేయాలని స్పష్టంగా చెబుతుందన్నారు. అధికారులు ఇప్పటికైనా వాస్తవాలు పరిశీలించి గిరిజన చట్టాలను పటిష్టంగా అమలు చేయాలని కోరారు. రికార్డ్ వెరిఫికేషన్ చేసి సాగులో ఉన్న గిరిజనులకు పట్టాలు ఇవ్వాలని మడకం వెంకటేశ్వరరావు కోరారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో రెడ్డి గణపవరం ఎంపిటిసి మాజీ సభ్యులు ఎ.ఫ్రాన్సిస్, వెలుతురువారిగూడెం, ఇప్పలపాడు, రెడ్డి గణపవరం తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

సాబ్జీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నేతలు

ఘనంగా షేక్ సాబ్జీ వర్ధంతి సభ

ప్రజాశక్తి - ద్వారకాతిరుమల

మాజీ ఎంఎల్‌సి షేక్ సాబ్జీ ద్వితీయ వర్ధంతి కార్యక్రమాన్ని ద్వారకాతిరుమల యుటిఎఫ్ భవనంలో సోమవారం నిర్వహించారు. యుటిఎఫ్‌కు ఆయన అందించిన సేవలు, ఉద్యమ స్ఫూర్తిని యుటిఎఫ్ నాయకులు గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ వెంకట్రావు, యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి దేవానందరావు, మండలాధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జయరాజు, శ్రీనివాసరావు, కోశాధికారి చిన్నబాబు, సహాధ్యక్షుడు రాంబాబు, కృష్ణ, ప్రకాష్, సాయిరాం పాల్గొన్నారు.

బస్సు సౌకర్యం పున:ప్రారంభించాలి

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల కేంద్రం జీలుగుమిల్లి నుంచి అంకన్నగూడెం వరకు గతంలో తిరిగే బస్సు సర్వీసును పున:ప్రారంభించాలని పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజును ఏజెన్సీ మారుమూల గ్రామస్తులు వేడుకున్నారు. మండలంలోని అంకన్నగూడెం, రాచన్నగూడెం పంచాయతీల్లో పల్లెపల్లెకు మన ఎంఎల్ఎ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు ఎంఎల్ఎ బాలరాజు దృష్టికి పలు సమస్యలను తీసుకెళ్లారు. మారుమూల ఏజెన్సీ గ్రామాల్లో నివసించే తమకు బస్సు సౌకర్యం, సరైన రోడ్లు, 108 సదుపాయం వంటివి లేవని చెప్పారు. ఏదైనా ప్రమాదం జరిగితే తెలంగాణ రాష్ట్రానికి వెళ్లాల్సి వస్తుందన్నారు. అనంతరం ఎంఎల్ఎ బాలరాజు మాట్లాడుతూ పల్లెల్లో సమస్యల పరిష్కారం కోసమే ఈ కార్యక్రమాన్ని పెట్టినట్లు చెప్పారు. సంబంధిత అధికారులతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచులు సున్నం వరలక్ష్మి, పైదా ముత్యాలమ్మ, జనసేన పార్టీ జిల్లా కార్యదర్శి కారటం సాయి, మండలాధ్యక్షులు పి.రాము, సొసైటీ అధ్యక్షులు సత్యనారాయణ రాజు, ఎంపిటిసి సభ్యులు నాలి శ్రీను, పలు శాఖల అధికారులు, కూటమి నాయకులు లక్ష్మీనారాయణ, అనిల్, వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తూతూ మంత్రంగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం తూతూమంత్రంగా నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ శుక్రవారం జరగాల్సిన సమావేశం కోరం లేక వాయిదా పడటంతో మళ్లీ ఆ సమస్య రాకుండా ఉండేందుకు ఎంపిటిసి కోసం నాలుగు గంటల వరకు వేచి చూసి తొమ్మిది మంది ఎంపిటిసిలకు ఎంపిపితో పాటు మరో ముగ్గురు హాజరు కావడంతో సమావేశాన్ని ప్రారంభించారు. అనంతరం జరిగిన సమావేశానికి పలువురు సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు రాకపోవడంతో ఖాళీ కుర్చీలతోనే సమావేశాన్ని తూతూ మంత్రంగా కానిచ్చేశారు. మూడు నెలలకోసారి నిర్వహించే సమావేశం ఇలా తూతూమంత్రంగా నిర్వహించడం పట్ల అధికారులకు సమస్యలు చెప్పుకోవడానికి ఏం ఆస్కారం ఉంటుందని మండల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వేపై అవగాహన

ప్రజాశక్తి - ముసునూరు

మాట్లాడుతున్న ఎంపిడిఒ ఏసుబాబు

యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ద్వారా ప్రతి కుటుంబం వివరాలు ఆన్‌లైన్‌లో పొందుపరచనున్నట్లు ఎంపిడిఒ పి.ఏసుబాబు తెలిపారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపిడిఒ పి.ఏసుబాబు, డిప్యూటీ ఎంపిడిఒ బసవరాజు అచ్యుత సత్యనారాయణ ఆధ్వర్యంలో మండలంలోని 16 గ్రామాల పంచాయతీ కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన యూనిఫైడ్ ఫ్యామిలీ సర్వే ద్వారా ప్రభుత్వ పథకాలు అర్హులైన వారికి చేరుతున్నాయా, లేదా, ఫ్యామిలీ బెనిఫిట్ కార్డు జారీ అయిందా, లేదా, భవిష్యత్తు సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా, నూటికి నూరు శాతం ఇకెవైసి చేయించుకున్నారా, వ్యక్తిగత కుటుంబ స్థాయి వివరాల సేకరణ, ఆధార్, మొబైల్, విద్య, ఉపాధి, ఆదాయం, ఆస్తులు, గృహ వివరాలు, సామాజిక కుటుంబ సమాచారం అన్ని ఆన్‌లైన్‌లో ఈ సర్వే ద్వారా పొందుపరచనున్నట్లు తెలిపారు. కేటాయించిన గ్రామాల్లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే నిర్వహించాలన్నారు.

విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు

ప్రజాశక్తి - భీమడోలు

వ్యక్తిత్వ వికాస కార్యక్రమాలు పదో తరగతి విద్యార్థులు మరింత సమర్థవంతంగా పరీక్షలకు హాజరైనందుకు సహకరిస్తాయని స్వచ్ఛంద సంస్థ మానవత జిల్లా ప్రతినిధి రామిశెట్టి గంగాధరరావు తెలిపారు. పొలసానిపల్లిలోని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ గురుకులం(బాలికలు) పాఠశాలలో భీమడోలు మానవత శాఖ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస తరగతులను సోమవారం నిర్వహించారు. సంస్థ పూర్వపు జిల్లా అధ్యక్షులు తాడేపల్లి మోహన్‌రావు, కెరియర్ గైడెన్స్ జిల్లా డైరెక్టర్ తుమ్మల ఉమామహేశ్వరరావు తరగతులను నిర్వహించారు. వివిధ అంశాల పట్ల విద్యార్థులకు అవగాహన కల్పించారు. పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థుల్లో మార్కుల సాధన పురస్కరించుకుని ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు మానవత సంస్థ తరపున తగు రీతిలో ప్రోత్సాహక బహుమతులు అందించారు. అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటాన్ని పాఠశాలలో ఏర్పాటు చేయాలని కోరుతూ చిత్రపటాన్ని పాఠశాల ప్రిన్సిపల్ భారతికి అందించారు. ఈ కార్యక్రమంలో మానవత జిల్లా కార్యవర్గ సభ్యులు గోనుగుంట రమణశంకర్ పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు పురస్కారాలు

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలుకు చెందిన శ్రీ మాధురి జూనియర్ కళాశాల (మాంటిస్సొరి సంస్థల అనుబంధం) ఆధ్వర్యంలో భీమడోలు మండల స్థాయిలో వివిధ పాఠశాలలో చదువుతున్న పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన ఎపెక్స్ ఇంటిలిజెంట్ టెస్ట్‌కు ఆదరణ లభించిందని కళాశాల కరస్పాండెంట్ కె.ప్రేమ్‌కుమార్ తెలిపారు. గణితం, సైన్సులలో ఆబ్జెక్టివ్ ప్రశ్నల ఆధారంగా వంద మార్కులకు పరీక్షలను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రథమ స్థానం దక్కించుకున్న వెజ్జు నిఖితా దేవికి రూ.ఐదు వేల నగదు పురస్కారం, ద్వితీయ స్థానం దక్కించుకున్న ఇద్దరు విద్యార్థులు జల్లా తరుణి, కరణం శ్రీ హర్షితలకు ఒక్కొక్కరికి రూ.మూడు వేల వంతున నగదు పురస్కారం, తృతీయ స్థానం దక్కించుకున్న భలే అంజలి, చిలకా స్వరూప, కొండేటి యశ్వంత్‌లకు ఒక్కొక్కరికి రూ.రెండు వేల చొప్పున నగదు పురస్కారాన్ని ప్రకటించినట్లు నిర్వాహకులు తెలిపారు. ప్రస్తుతం నిర్వహించిన పరీక్షల్లో 80 శాతం మార్కులు దాటి మొదటి 15 స్థానాల్లో నిలిచిన విద్యార్థులు ఇంటర్‌లో తమ కళాశాలలో చేరితే 50 శాతం ఫీజు రాయితీ అందించనున్నట్లు పాఠశాల కరస్పాండెంట్ తెలిపారు.

నేరాలు - ఘోరాలు

ఆగి ఉన్న లారీని ఢీకొన్న కారు

భార్యాభర్తలకు గాయాలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

వేగంగా వచ్చిన కారు ఆగి ఉన్న లారీని వెనుక నుండి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కారులో ప్రయాణిస్తున్న భార్యాభర్తలిద్దరూ తీవ్ర గాయాలపాలయ్యారు. ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం... ఏలూరు రూరల్ పరిధిలోని తూర్పు లాకుల వద్ద రోడ్డుపై ఒక లారీ నిలుపుదల చేశారు. ఏలూరు నుంచి రాజమండ్రి వైపు వెళ్తున్న కారు ఆ లారీని వెనుక నుంచి బలంగా ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రాజమండ్రికి చెందిన ఎఆర్ హెడ్ కానిస్టేబుల్ శ్రీనివాసరావు, అతని భార్య తీవ్ర గాయాలపాలయ్యారు. సమాచారం అందుకున్న ఏలూరు రూరల్ ఎస్ఐ నాగబాబు ఘటనా స్థలానికి వెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. క్షతగాత్రులను స్థానికంగా ఉన్న ప్రైవేటు ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు.

ప్రజాశక్తి
ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు
ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం
సెల్: 83339 88814

పొట్టి శ్రీరాములు త్యాగం మరువలేనిది

వర్ధంతి కార్యక్రమాల్లో ప్రముఖులు



ఏలూరులో...

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

పొట్టి శ్రీరాములు ఆంధ్ర రాష్ట్రం కోసం చేసిన కృషి, దీక్ష రాష్ట్ర ప్రజలు ఎన్నటికీ మరువలేరని ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ అన్నారు. పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని ఏలూరు జిల్లా పోలీసు కార్యాలయంలో వర్ధంతి సభను నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. పొట్టి శ్రీరాములు భావాలను రాష్ట్ర ప్రజలు చిరకాలం అనుసరిస్తూ ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఆర్ అదనపు ఎస్‌పి మునిరాజా, ఆర్ఐ పవన్‌కుమార్, ఆర్య, భాస్కరరావు, ఎఒ మస్తాన్‌రావు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఏలూరు అర్బన్ : స్థానిక ఏలూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల చరిత్ర విభాగం ఆధ్వర్యంలో సోమవారం అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి సభను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు అధ్యక్షత వహించి, పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ డాక్టర్ జి.గిరిబాబు మాట్లాడుతూ భాషా ప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటుకు పునాది వేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. నేటి యువత ఆయన త్యాగనిరతిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ముఖ్య వక్తగా హాజరైన చరిత్ర అధ్యాపకులు ఎం.కృష్ణచైతన్య మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం పొట్టి శ్రీరాములు చేసిన ఆమరణ నిరాహార దీక్షను, ఆయన ఆత్మబలిదానాన్ని విద్యార్థులకు వివరించారు. తెలుగు వారి ఆత్మగౌరవం కోసం ప్రాణాలర్పించిన ఆయన త్యాగం మరువలేనిదన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వి.వెంకట్రావు, డాక్టర్ ఎం.రాంబాబు, డాక్టర్ ఎం.విజయ్‌కుమార్, ఎస్.పరమేశ, రమేష్, టివి.దుర్గాప్రసాద్, సుశ్యలత, సుజాత పాల్గొన్నారు.

కొయ్యలగూడెం : శ్రీపొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ శ్రీ పొట్టి శ్రీరాములు తెలుగు ప్రజల కోసం చేసిన అమూల్యమైన త్యాగం ఫలితంగానే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అవతరించిందని చెప్పారు. ఆయన త్యాగం తెలుగు జాతికి చిరస్మరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ సిబ్బంది, అధికారులు పాల్గొన్నారు.

ఏలూరు సిటీ : ఆంధ్ర రాష్ట్ర ఆవిర్భావం కోసం తన ప్రాణాలర్పించిన అమరజీవి పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం చిరస్మరణీయమని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి అన్నారు. అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతిని పురస్కరించుకుని సోమవారం ఏలూరు వసంతమహల్ సెంటర్‌లో ఉన్న ఆయన విగ్రహానికి ఆర్యవైశ్య ప్రముఖులతో కలిసి ఎంఎల్ఎ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడుతూ తెలుగువారందరికీ ప్రత్యేక రాష్ట్రం కావాలని పొట్టి శ్రీరాములు చేసిన పోరాటం భాషాప్రయుక్త రాష్ట్రాల ఆవిర్భావానికి జీవపోసిందని గుర్తుచేశారు. అటువంటి మహనీయుని త్యాగాలను స్మరించుకుంటూనే, ఆయన ఆశయాల సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని ఎంఎల్ఎ చంటి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, మాజీ కార్పొరేటర్ గూడవల్లి శ్రీనివాస్, ఆర్యవైశ్య ప్రముఖులు చలువాది శివకృష్ణ బ్రహ్మయ్య, మద్దుల పవన్‌కుమార్, తవ్వా అరుణకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆగిరిపల్లి : అమరజీవి పొట్టి శ్రీరాములు వర్ధంతి వేడుకలను ఆగిరిపల్లి మెయిన్ సెంటర్‌లో పొట్టి శ్రీరాములు, బాపూజీ విగ్రహాల వద్ద ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో నిర్వహించారు. పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘ నాయకులు సిహెచ్.వెంకటరత్నం, జె.చంద్రమౌళీశ్వరరావు, ఎం.గోపాల్, వై.రాంబాబు, వై.నరసింహారావు, మారుతి, ప్రణీత్, ముక్తేశ్వరరావు, శివరాం, చంద్రశేఖరరావు,

ఆగిరిపల్లిలో..

ఆర్.వెంకటేశ్వరరావు, నరసింహామూర్తి పాల్గొన్నారు.

పోలవరం : పోలవరం మండల పరిషత్ కార్యాలయంలో అమరజీవి శ్రీ పొట్టి శ్రీరాములు వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ సిహెచ్.శ్రీనివాసుబాబు, డిప్యూటీ ఎంపిడిఒ రవికుమార్‌తో పాటు మండల పరిషత్ సిబ్బంది అమరజీవి పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రత్యేక ఆంధ్ర రాష్ట్ర సాధన కోసం ప్రాణత్యాగం చేసిన మహనీయుడు పొట్టి శ్రీరాములు అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొని అమరజీవికి నివాళులర్పించారు.

విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని వినతి

ప్రజాశక్తి - భీమడోలు

భీమడోలు హైస్కూల్ ఆవరణలో విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని పలు సౌకర్యాలు కల్పించాలని, నిధులు మంజూరు చేయాలని ఉపాధ్యాయులు కోరుతున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయిని జి.శేషపద్మజ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు సోమవారం పాఠశాలలు సందర్శించడానికి వచ్చిన ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ పాఠశాలలో 950 మంది వరకు విద్యార్థులు ఉన్నారన్నారు. వీరిలో కనీసంగా దూర ప్రాంతాల నుంచి వచ్చే 450 మంది వరకు విద్యార్థులు సైకిళ్లపై వస్తున్నారని తెలిపారు. సైకిల్ షెడ్డు లేని కారణంగా వీరి సైకిళ్లకు భద్రత లేకుండా పోయిందన్నారు. కొందరు ఆకతాయిలు విద్యార్థుల సైకిళ్లను పాడు చేస్తున్నారన్నారు. సైకిల్ షెడ్డు ఏర్పాటు చేయాలని కోరారు. మధ్యాహ్న భోజనం చేసేందుకు విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పాలవుతున్నారని తెలిపారు. భోజనశాలను ఏర్పాటు చేయాలని కోరారు. ఖాళీ సమయంలో స్టడీ హాలుగా సైతం వినియోగించుకునే అవకాశం ఉందన్నారు. సీసీ రోడ్డు నిర్మించాలని కోరారు. కొందరు ఆకతాయిలు సెలవు దినాల్లో పాఠశాల తలుపు పగలకొడుతున్నారని, పంపులను పాడు చేస్తున్నారని, ఫ్యాన్ రేకులను వంచి వేస్తున్నారన్నారు. నివారణకు పాఠశాల ఆవరణలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని కోరారు. దీనిపై స్పందించిన ఎంఎల్ఎ మాట్లాడుతూ పాఠశాలకు విద్యార్థుల సౌకర్యార్థం భోజనశాల, సైకిల్ షెడ్డు ఏర్పాటుకు హామీ ఇచ్చారు.

పిజిఆర్ఎస్‌కు 38 అర్జీలు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా 38 ఫిర్యాదులు అందాయని అదనపు ఎస్‌పి నక్క సూర్యచంద్రరావు అన్నారు. నగరంలోని జిల్లా పోలీస్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఎఎస్‌పి సూర్యచంద్రరావు ఫిర్యాదులు స్వీకరించారు. ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత పోలీసు అధికారులకు ఫోన్‌లో ఆదేశాలు జారీ చేశారు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వచ్చిన ఫిర్యాదుదారులకు శ్రీ సత్య సాయి సేవా ట్రస్ట్ ద్వారా ఉచిత భోజన సౌకర్యాన్ని ఏర్పాటు చేశామని తెలిపారు.

నూజివీడు టౌన్ : పట్టణంలోని సబ్ కలెక్టర్ కార్యాలయంలో సోమవారం మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ బి.వినూత్న మాట్లాడుతూ నిర్ణీత వ్యవధిలోనే సమస్యలు పరిష్కరించాలని అధికారులకు తెలిపారు. డివిజన్ పరిధిలో మొత్తం 36 అర్జీలు అందాయన్నారు. అనంతరం సబ్ కలెక్టర్ మానవత్వాన్ని చాటుకుని అర్జీదారుని వద్దకే వచ్చి సమస్య తెలుసుకున్నారు.

పోలవరంలో విజిబుల్ పోలీసింగ్

ప్రజాశక్తి - పోలవరం

ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పోలవరం ఎస్ఐ పవన్‌కుమార్ సూచించారు. ఎస్ఐ పవన్‌కుమార్ తన సిబ్బందితో కలిసి పోలవరం పరిధిలో సోమవారం విజిబుల్ పోలీసింగ్ (ఫుట్ పెట్రోలింగ్) నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాలు, ప్రధాన రహదారులు, జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో ఫుట్ పెట్రోలింగ్ నిర్వహిస్తూ ప్రజల్లో భద్రతా భావం పెంపొందించడంతో పాటు, రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు, సైబర్ నేరాలపై అవగాహనా కార్యక్రమం చేపట్టారు. ముఖ్యంగా విద్యార్థులు, యువతను లక్ష్యంగా చేసుకుని పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ పవన్‌కుమార్ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, ప్రమాదాల సమయంలో హెల్మెట్ ప్రాణాలను కాపాడుతుందని వివరించారు. వాహనదారులు ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించాలని, అతివేగం నివారించాలన్నారు. ప్రతి ద్విచక్ర వాహనదారుడు సురక్షితంగా వాహనం నడిపి, సురక్షితంగా గమ్యస్థానానికి చేరుకోవాలని ఎస్ఐ పవన్ కుమార్ పిలుపునిచ్చారు.

సమస్యలపై నేడు వినతుల స్వీకరణ

బుట్టాయగూడెం : మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో పోలవరం ఎంఎల్ఎ చిర్రి బాలరాజు అధ్యక్షతన ఈ నెల 16వ తేదీ మంగళవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించనున్నట్లు ఎంపిడిఒ కె.జ్యోతి సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు తమ తమ గ్రామాలకు సంబంధించిన సమస్యల పరిష్కారం కోసం తప్పనిసరిగా దరఖాస్తులు అందించాలని తెలిపారు. మండలంలోని అన్ని శాఖలకు సంబంధించిన అధికారులు హాజరై, తమ తమ శాఖలకు సంబంధించిన దరఖాస్తులను పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటారని తెలిపారు.

వైద్య విద్యార్థిని వైష్ణవికి సత్కారం

ప్రజాశక్తి - ముదినేపల్లి



వైష్ణవిని సత్కరిస్తున్న ప్రముఖులు

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవిని పలువురు ప్రముఖులు సన్మానించారు. కాపు కార్పొరేషన్ డైరెక్టర్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి శాయిన పుష్పావతి, గుడివాడకు చెందిన వైద్య నిపుణులు మాగంటి శ్రీనివాస్, డాక్టర్ పొట్లూరి వంశీ, చేవూరు నీటి సంఘం అధ్యక్షుడు శాయిన ప్రసాదరావు ముదినేపల్లిలోని వైష్ణవి నివాసంలో సోమవారం ఆమెను కలిసి రాజధాని నిర్మాణానికి నిధుల సేకరణకు ప్రజలను చైతన్యవంతులను చేస్తున్న ఆమె కృషిని అభినందించి సత్కరించారు. వైష్ణవికి సహకరిస్తున్న ఆమె తండ్రి డాక్టర్ మనోజ్‌ను అభినందించారు.

మనోజ్‌కు బెస్ట్ సోషల్ వర్క్ అవార్డు

ముఖ్యంగా ఆపదలో ఉన్నవారికి రెండు దశాబ్దాల పాటు చేసిన విశిష్టమైన ప్రభావవంతమైన సేవలకు గుర్తింపుగా డాక్టర్ అంబుల మనోజ్ బెస్ట్ సోషల్ వర్క్ అవార్డుకు ఎంపికయ్యారు. ద్వారకాతిరుమలలో బెస్ట్ సోషల్ వర్క్ అవార్డు 2025ను రితిక ఫౌండేషన్ ద్వారా ఈ నెల 21 ఆదివారం అందుకోనున్నారు.

వైష్ణవికి ఉత్తమ నంది అవార్డు

అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి ఉత్తమ నంది అవార్డుకు ఎంపికయ్యారు. ఒక వైపు మెడికల్ విద్యార్థినిగా, మరో వైపు అమరావతి రాజధానికి తన వంతు సహకారం అందించడంలో విశేష కృషి చేశారు. అంబుల వైష్ణవి చేస్తున్న సేవలను రితిక ఫౌండేషన్ గుర్తించింది. ఉత్తమ నంది అవార్డు 2025ను రితిక ఫౌండేషన్ ద్వారా ఈ నెల 21న ద్వారకా తిరుమలలో వైష్ణవి అందుకోనున్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

ముదినేపల్లిలోని పెయ్యేరు కాలనీలో నివాసం ఉంటున్న ఆలమూరు స్వామి గుండెపోటుతో సోమవారం మృతి చెందారు. ఆయన నిరుపేద కుటుంబం, ఇద్దరు చిన్నపిల్లలతో అద్దె ఇంట్లో నివాసం ఉంటూ ఇస్త్రీ చేసుకుంటూ తన జీవనం సాగిస్తూ ఉంటాడు. విషయం తెలుసుకున్న అమరావతి బ్రాండ్ అంబాసిడర్ అంబుల వైష్ణవి తన తండ్రి డాక్టర్ మనోజ్ ద్వారా రూ.ఐదు వేల నగదును మరణించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు అంత్యక్రియల నిమిత్తం అందించి మనోజ్ ఆ కుటుంబాన్ని ఓదార్చారు.

వరి మోడులను, గడ్డిని కుళ్లబెట్టి భూమిలో కలపాలి

ఎఒ జి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి - మండవల్లి

వరి మోడులను, గడ్డిని కుళ్లబెట్టి భూమిలో కలపడం ద్వారా భూమి ఉత్పాదక శక్తిని పెంపొందించుకుంటుందని వ్యవసాయ శాఖాధికారి జి.శ్రీనివాసరావు స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఆయన సోమవారం ప్రజాశక్తితో మాట్లాడారు. వరి పంటలను వరి కోత మిషన్‌ను వినియోగించి కోయడంతో వరిగడ్డి ముక్కలు ముక్కలు అయిపోయి వరి పొలంలోనే ఉంటుందన్నారు. రైతులు మరో పంటకు సమాయత్తమయ్యే క్రమంలో వరి దుబ్బులను, తుక్కును కాల్చి వేస్తున్నారని తెలిపారు. పంట పొలంలోని వరి దుబ్బులను, తుక్కును మంట పెట్టి కాల్చివేయడం ద్వారా కాలుష్యం పెరగడంతో పాటు పంటకు లాభం చేసే మిత్ర పురుగులు చనిపోతాయని తెలిపారు. వరి మోడులను, తుక్కును కుళ్లబెట్టి భూమిలో కలపడం ద్వారా సేంద్రియ కర్బనం పెరుగుతుందని, వరి పంటకు మేలు చేసే కోట్లాది సూక్ష్మజీవుల సంఖ్య పెరగడంతో పాటు భూసారం పెరుగుతుందని చెప్పారు. అంతేకాకుండా వరి పంట ఆశించే తెగుళ్లను తట్టుకునే శక్తిని పెంపొందించుకుంటుందని, అధిక దిగుబడి సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. గడ్డిని, దుబ్బులను కాల్చి వేయడం ద్వారా లాభం లేకపోగా పంటకు నష్టం వాటిల్లుతుందని, కుళ్లబెట్టి భూమిలో కలిపి వేయడం ద్వారా భూమి సారం పెరిగి రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించుకునేందుకు దోహదపడుతుందని తెలిపారు. మిషన్ కోత ద్వారా వచ్చిన వరిగడ్డిని సేకరించి పశుగ్రాసంగా వినియోగించుకుంటే ప్రశుగ్రాసం కొరతను అధిగమించవచ్చని చెప్పారు. వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు నిర్వహిస్తున్న పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో వరి దుబ్బులను, గడ్డిని పొలంలో కాల్చవద్దని తెలుపుతూనే ఎలా కుళ్లబెట్టాలి, భూమిలో ఎలా కలపాలి అనేదానిపై రైతులకు ఎప్పటికప్పుడు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నామని తెలిపారు.

భవిత విద్యాలయాల అభివృద్ధికి సాయం అభినందనీయం

ప్రజాశక్తి - భీమడోలు

ప్రత్యేక అవసరాల విద్యార్థుల కోసం ప్రత్యేకించిన భవిత విద్యాలయాల అభివృద్ధికి దాతలు ముందుకు రావడం అభినందనీయమని ఉంగుటూరు ఎంఎల్ఎ పత్సమట్ల ధర్మరాజు అన్నారు. భీమడోలు హైస్కూల్ ఆవరణలో క్యాడ్ బరీస్ ఇండియా, అనుబంధ సంస్థ మాండ్ లీజ్ కోకో లైఫ్ కార్యాలయం తమ సంస్థకు చెందిన కార్పొరేట్ బాధ్యత నిధులు రూ.25 లక్షలతో అధునాతన సౌకర్యాలతో నిర్మించిన భవిత విద్యాలయ భవనాన్ని ఎంఎల్ఎ సోమవారం ప్రారంభించారు. ఎంఎల్ఎ చొరవతో కలెక్టర్ సిఫార్సు మేరకు పి-ఫోర్ కార్యక్రమంలో భాగంగా సంస్థకు చెందిన సామాజిక బాధ్యత నిధులతో భవిత విద్యాలయ నిర్మించారు. దీనిలో ప్రత్యేక విద్య, స్పీచ్ థెరపీ, ఫిజియోథెరపీ, వృత్తి శిక్షణ, ప్రత్యేక అవసరాలు గల విద్యార్థుల వ్యక్తిగత అభివృద్ధికి సహకరించే అంశాలను పొందుపరిచారు. ప్రత్యేక అవసరాల విద్యార్థుల కనీస అవసరాలను ఏ విధమైన ఇబ్బంది లేకుండా తీసుకునేందుకు అవసరమైన నిర్మాణాలను ఏర్పాటు చేశారు. సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించే బీన్ టు బార్ కార్యక్రమాన్ని సందర్శించారు.

పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంకుస్థాపన

ప్రజాశక్తి - ఉంగుటూరు

నారాయణపురంలో రూ.రెండు కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు ఉంగుటూరు ఎంఎల్ఎ ధర్మరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. వైఎస్ఆర్ కాలనీ సి-బ్లాక్‌లో సిమెంట్ రోడ్లను గ్రామ పంచాయతీ నిధులు రూ.1.60 కోట్లు, ఉపాధి హామీ నిధులు రూ.40 లక్షలతో నిర్మిస్తున్నారు. గ్రామాల్లో మౌలిక వసతుల కోసం ప్రభుత్వం కట్టుబడి ఉందని ధర్మరాజు అన్నారు. ఆప్కాబ్ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు గన్ని వీరాంజనేయులు, గ్రామ సర్పంచి దిడ్ల అలకనంద శ్రీను, ఉప సర్పంచి మరడ సాంబశివరావు, పంచాయతీ పాలకవర్గ సభ్యులు, గ్రామస్తులు, కూటమి నాయకులు అక్కిన నాగమణి, పంచాయతీరాజ్ డిఇ వేణుగోపాల్, కృష్ణమోహన్, ఎంపిడిఒ రాజ్‌మనోజ్, డిప్యూటీ ఎంపిడిఒ జి.రమేష్‌బాబు, గుత్తేదారుడు అక్కిన శేషు, టిడిపి నాయకులు పాల్గొన్నారు.

సర్పంచి పుట్టినరోజు కేక్ కట్ చేసిన గన్ని

నారాయణపురం సర్పంచి దిడ్ల అలకనంద పుట్టినరోజు సందర్భంగా సోమవారం కేక్ కటింగ్ ఏర్పాటు చేశారు. గన్ని వీరాంజనేయులు ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేసి అలకనందకు అభినందనలు తెలిపారు. టిడిపి నాయకులు, పాలకవర్గ సభ్యులు, పంచాయతీ, సచివాలయ ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - దెందులూరు

దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ నియోజకవర్గ పరిధిలోని పలువురు బాధితులకు వారింటి వద్దకే వెళ్లి సిఎం సహాయ నిధి చెక్కులను సోమవారం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న పెదవేగి మండలం పెదకడిమి గ్రామంలో కూచిపూడి కనకతాయారుకు రూ.50,227, ఉండవల్లి సీతారావమ్మకు రూ.80 వేలు, దెందులూరు మండలం కొవ్వలి గ్రామంలో ఏరిపాక కృష్ణకు రూ.42,465 చెక్కులను అందించారు. అనంతరం పోతునూరు గ్రామంలో పర్యటించిన ఎంఎల్ఎ గ్రామ రహదారుల్లో చెత్త పేరుకుపోయి ఉండటం చూసి అసంతృప్తి వ్యక్తం చేశారు. గ్రామాల్లో స్వచ్ఛతపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ చెత్త సేకరణ పటిష్టంగా అమలు చేయాలని ఇప్పటికే పలుమార్లు ఆదేశించినా కూడా కొన్ని గ్రామాల్లో స్థానిక కూటమి నాయకులు, సంబంధిత అధికారులు సిబ్బంది ఉదాసీనత వ్యవహరిస్తున్నారన్నారు. గ్రామాల పరిశుభ్రత, ప్రజల ఆరోగ్యం పట్ల ఎవరైనా అలసత్వం ప్రదర్శిస్తే ఇకపై ఉపేక్షించబోమని చెప్పారు. గ్రామాల్లో చెత్త తొలగింపును చిత్తశుద్ధితో అమలు చేయాలని, తడి, పొడి చెత్తను కూడా వేరుచేసి సేకరించాలని, ఈ అంశంపై గ్రామాల్లో ప్రజలకు సైతం విస్తృతంగా అవగాహన కార్యక్రమం నిర్వహించాలని దెందులూరు ఎంఎల్ఎ చింతమనేని ప్రభాకర్ సూచించారు.

నేడు ఏలూరులో మంత్రి దుర్గేష్ పర్యటన

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక వ్యవహారాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ మంగళవారం ఏలూరు జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు విజయవాడ నుంచి కారులో బయలుదేరి పది గంటలకు ఏలూరు చేరుకుంటారు. ఏలూరు అగ్రహారంలో రామకోటి వద్ద ఏర్పాటు చేసిన ఆర్కియోలాజికల్ మ్యూజియాన్ని మంత్రి కందుల దుర్గేష్ ప్రారంభించనున్నారు. అనంతరం మధ్యాహ్నం 12 గంటలకు ఏలూరు నుంచి రాష్ట్ర సచివాలయానికి మంత్రి బయలుదేరి వెళ్తారని అధికార వర్గాలు వెల్లడించాయి.

వైద్య, విద్యా దాన సమాజం సేవలు అభినందనీయం

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అవసరార్థులకు సేవలందించే విషయంలో అన్న వస్త్ర వైద్య విద్యా దాన సమాజం చేస్తున్న కృషి వెలకట్టలేనిదని ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి ప్రశంసించారు. ఏలూరు కుండి సెంటర్‌లో శ్రీ అన్న వస్త్ర వైద్య విద్యా దాన సమాజం వార్షికోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ముఖ్య అతిథిగా ఏలూరు ఎంఎల్ఎ బడేటి చంటి హాజరయ్యారు. దీనిలో భాగంగా ఉచిత వైద్య శిబిరం, దుప్పట్ల పంపిణీ కార్యక్రమాలతో పాటు అన్నసమారాధనను నిర్వహించారు. తొలుత నిర్వహించిన సభలో ఎంఎల్ఎ బడేటి చంటి మాట్లాడారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ మామిళ్లపల్లి పార్థసారధి, ఇఒ పెన్మెత్స వెంకటకృష్ణంరాజు, టిడిపి నగర అధ్యక్షులు చోడే వెంకటరత్నం, డివిజన్ ఇన్‌ఛార్జి బచ్చు మురళీ, నాయకులు తవ్వా అరుణకుమారి, మాజీ ఛైర్మన్ పూజారి నిరంజన్, తదితరులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు నేరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని నూజివీడు సబ్ కలెక్టర్ బి.వినూత్న అన్నారు. మండలంలోని ఓగిరాల తండా గ్రామంలో బాల్య వివాహాలకు వ్యతిరేకంగా మహిళ శిశుసంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అవగాహనా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన సబ్ కలెక్టర్ వినూత్న మాట్లాడుతూ బాల్య వివాహాలు నిర్వహిస్తే వధూవరుల తల్లిదండ్రులపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఈ సందర్భంగా బాల్య వివాహాలు నిర్వహించబోమంటూ గ్రామస్తులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నూజివీడు డిప్యూటీ మెడికల్ హెల్త్ అధికారి పద్మావతి, తహశీల్దార్ బద్రు, సిడిపిఒ విజయకుమారి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ చౌర్యం సామాజిక నేరం

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

విద్యుత్ చౌర్యం సామాజిక నేరమని నూజివీడు ఆపరేషన్, డివిజన్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ అన్నారు. మండలంలోని మీర్జాపురం సెక్షన్‌లో విద్యుత్ విజిలెన్స్ విభాగం ఆధ్వర్యంలో సోమవారం విస్తృత తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ సర్వీసుల తనిఖీలు భారత విద్యుత్ చట్టానికి లోబడి ఉంటాయని తెలిపారు. విద్యుత్ చౌర్యంపై ఫిర్యాదులను 8331020537, 8330114951, 9493174284 నెంబర్లకు నేరుగా గాని వాట్సాప్ ద్వారా గాని తెలియజేయాలని సూచించారు. ఈ తనిఖీల్లో 40 మంది అధికారులు 50 మంది సిబ్బందితో బందాలుగా ఏర్పడి 3,109 సర్వీసులను తనిఖీ చేశారు. అనుమతించిన లోడు కంటే అదనంగా వాడుతున్న 247 సర్వీసుల నుంచి రూ.7.86 లక్షలు, సర్వీసు మంజూరైన కేటగిరి కాకుండా వేరే కేటగిరిలో విద్యుత్ వినియోగిస్తున్న నాలుగు సర్వీసుల నుంచి రూ.52 వేలను అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు.

ఇంధన పొదుపుతో భావితరాలకు భరోసా

నూజివీడు టౌన్ : ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతతో ఇంధన పొదుపు చర్యలు పాటిస్తూ భావితరాలకు భరోసా ఇవ్వాలని నూజివీడు ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎ.సత్యనారాయణ అన్నారు. ఇంధన పొదుపు వారోత్సవాల్లో భాగంగా మండలంలోని మీర్జాపురం గ్రామంలో సోమవారం ఎ.సత్యనారాయణ డివిజన్ పరిధిలోని తన సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంధన పొదుపుపై అవగాహన ఫ్ల కార్డులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరాలకు మంచి పర్యావరణాన్ని అందించేలా ఇంధన వనరులను బాధ్యతతో వినియోగించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎఇ సునీత, మీర్జాపురం ఎఇ బాబూరావు, డివిజన్ పరిధిలోని ఎఇలు, సబ్ ఇంజినీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

నోటీసు
మహారాజశ్రీ కొవ్వూరు అడిషినల్ సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) కొవ్వూరు
O.S.No.171/2004

కోయ మాధవరావు ...వాది
మరియు
కోయ లక్ష్మీబాయి వగైరాలు ...ప్రతివాదులు
టు.
7. కోయ మధుసూదన ప్రసాద్ S/o. (లేటు) సుబ్బారావు, C/o. Padma Nursing Home, Near Menta Vari Satram, Powerpet, Eluru.
8. కోయ శ్రీనివాసరావు S/o. (లేటు) సుబ్బారావు, C/o. Padma Nursing Home, Near Menta Vari Satram, Powerpet, Eluru.
9. ముత్యాల పద్మజ W/o. రామసుబ్బారావు, Gandredu Gollalamamidada Mandal, E.G.Dt.

పై నెంబరు దావాలో 7 టు 9 ప్రతివాద్యు అయిన మీకు ఎన్నిసార్లు దావా సమనులు పంపించు చున్ననూ మీరు బుద్ధి పూర్వముగా తీసుకొనకుండా నిలువరించుచున్నందున శ్రీ కోర్టువారు సబ్‌స్టిట్యూట్ సర్వీస్ ద్వారా అమలు చేయమని ఆర్డరు వేసినందున, యీ ప్రకటన ద్వారా మీకు వాయిదా తెలియజేయడమైనది.కావున **ది.31-12-2025**వ తేది ఉదయం **గం॥10.30ని॥లకు** మీ యొక్క హాజరు నిమిత్తం వాయిదా అయి వున్నది. ఆరోజున మీరు స్వయంగా గాని లేదా మీ ప్లీడరు గారి ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరు అయి మీ ఆక్షేపణలు తెలియపరచుకొనవలెను. లేని యెడల మీ పరోక్షమున తీర్మానించడమగును.

వాయిదా తేది.31-12-2025

MADDIPATI SRINIVAS
Advocate,Kovvur.
Cell.9346650165